నోబెల్ శాంతి సమావేశానికి
'భట్టి'కి ఆహ్వానం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 18 నుంచి 21 వరకు మెక్సికో దేశంలో జరిగే 10వ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం అందింది. ఈ మేరకు నిర్వాహకులు ఆయనకు ఆహ్వానం పంపారు. 'ప్రగతి కోసం శాంతి' అనే ఎజెండాతో ఈ సమావేశాలు జరుగనున్నాయి. నోబెల్ బహుమతి గ్రహీతలు, ప్రపంచశాంతి న్యాయవాదులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

ఇంపాక్ట్ ప్లేయర్ పురస్కారాన్ని అందుకుంటున్న మిశ్రా

ఈఈఎస్ఎల్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : కేంద్ర విద్యుత్తు శాఖకు చెందిన ప్రభుత్వరంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్)కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. 2023-24 సంవత్సరానికి భారత పరిశ్రమ సమాఖ్య(సీఐఐ) అందించే 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును దక్కించుకుంది. సీఐఐ రజతోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ సెక్రటరీ మిలింద్ దియోరా చేతులమీదుగా ఈఈఎస్ఎల్ సీజీఎం అనిమేశ్ మిశ్రా పురస్కారాన్ని అందుకున్నారు. ఉజాలా పథకం కింద 36 కోట్ల ఎల్ఈడీ బల్బులు పంపిణీ చేయడమే కాకుండా, 1.3 కోట్ల వీధి దీపాలను అమర్చింది. కార్యక్రమంలో సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయిదేవరాజులు ప్రసాద్, ఇంధన సామర్థ్య కౌన్సిల్ చైర్మన్ రవిచంద్రన్, సీఐఐ ఈడీ కేవీఎస్ వెంకటగిరి, గిరిజాశంకర్, పీవీ కిరణ్, అనంత్ పాల్గొన్నారు.

చైనాలో దర్శకత్వం.. దుబాయ్‌లో స్క్రీన్‌ప్లే!

- తెలంగాణలో కమీషన్ ఖాతాలు.. కోట్లల్లో డబ్బులు
- మ్యూల్ ఖాతాల డబ్బంతా క్రిప్టోగా మార్పు
- చైనా, దుబాయ్‌లలో కింగ్‌పిన్‌లు
- చేతులు మారుతున్న కోట్లాది రూపాయలు

చట్టవిరుద్ధంగా సంపాదిస్తున్న డబ్బును తమ ఖాతాలకు చేరవేసేందుకు సైబర్ మోసగాళ్లు కొత్తమార్గాన్ని ఎంచుకున్నారు. కమీషన్ల ఆశ చూపుతూ మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ ద్వారా కోట్లు దారి మళ్లిస్తున్నారు. ఇందుకు తెలంగాణను కేంద్రంగా ఎంచుకొని ఇక్కడి అమాయకులను ఇరికిస్తున్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి వందల కోట్లు చేతులు మారుతున్నాయి. రాష్ట్రంపై ప్రత్యేక దృష్టిసారించిన సైబర్ నేరగాళ్లు.. మనవాళ్లను నమ్మించి మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ తీయించి.. ప్రతిరోజూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఆ కొల్లగొట్టిన డబ్బును ఏకంగా క్రిప్టోలోకి మార్చి.. సైబర్ కింగ్‌పిన్‌లకు పంపుతున్నారు. ఈ తతంగమంతా మొన్నటి వరకు రహస్యంగా జరిగినా.. ఇటీవల సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఈ స్కామ్‌ను బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా కొన్ని అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నుంచి భారీగా డబ్బులు విత్ డ్రా అయిన ఘటనలు బ్యాంకు అధికారుల దృష్టికి రావడంతో.. వారు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు సమాచారం ఇచ్చారు. కొత్త తరహా మోసాలపై లోతుగా విచారించడంతో చైనా, దుబాయ్‌లో ఉంటున్న కింగ్‌పిన్‌లు ఈ సైబర్ రాకెట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ స్కామ్‌ను ఎలా చేపట్టాలో చైనా కింగ్‌పిన్‌లు బోధిస్తుండగా దుబాయ్‌లో ఉండే మరికొందరు హైదరాబాద్‌లోని సైబర్ స్లీపర్‌సెల్స్‌తో పక్కాగా అమలయ్యేలా చూస్తున్నారు.

మనోళ్లు సమిధలా? నేరస్తులా?

దుబాయ్, చైనా కింగ్‌పిన్‌లు చెప్పిట్టుగా కమీషన్ల కోసం కరెంట్ బ్యాంకు అకౌంట్లు తీయిస్తున్న తెలంగాణకు చెందిన సైబర్ స్లీపర్ సెల్స్ సమిధలుగానే సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. పేదలను గుర్తించడం, వారి ద్వారా అకౌంట్లు ఓపెన్ చేయించి, కమీషన్లు ఇవ్వడం, ఆ డబ్బును క్రిప్టోగా మార్చడంలోనూ వీళ్లే కీలకంగా ఉండటంతో నేరస్తులుగా కూడా పరిగణిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న ఈ మ్యూల్ అకౌంట్ల వ్యవహారంపై దృష్టి సారించి, లావాదేవీల వివరాలు ఇవ్వాలని బ్యాంకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సైబర్ నేరాల ద్వారా సంపాదించిన రూ.175 కోట్లను హైదరాబాద్‌లోని శంషీర్‌గంజ్ ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి పలు దఫాలుగా విత్‌డ్రా చేసి, క్రిప్టోగా మార్చిన సైబర్ రాకెట్‌లో కీలకమైన కింగ్‌పిన్‌లను అరెస్టు చేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నట్టు చెబుతున్నారు.

అత్యాశతో కోట్లు నష్టం

హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు రూ.8.6 కోట్లు మోసపోయిన ఘటన మరువక ముందే.. ఓ వృద్ధుడి నుంచి ఏకంగా రూ.13.26 కోట్లను కొల్లగొట్టారు. సామాన్యుల నుంచి చిల్లరే వస్తుండటంతో.. కొత్తగా ఆన్‌లైన్ వేదికగా స్టాక్‌లో పెట్టుబడులు పెట్టేవారి ఖాతాల్లో లక్షలు, కోట్ల రూపాయలు ఉండటంతో వారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. చిట్కాల పేరిట మెసేజ్‌లు పంపి, నకిలీ సైట్‌ల లింకులు పెట్టి ఉన్నది మొత్తం ఊడ్చేస్తున్నారు. పెట్టుబడి పెట్టడానికి ఆకర్షితులైతే ఆపరేటర్లు మొదట్లో డబ్బును మోసపూరిత వ్యక్తి తాలూకు బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారు. ఈ విధంగా నమ్మించి తమ ప్రీమియం, వీఐపీ ఛానెళ్లకు సభ్యత్వాన్ని పొందాలని ఒత్తిడి చేస్తారు. తద్వారా మరిన్ని ఎక్కువ లాభాలు వస్తాయని హామీ ఇస్తుంటారు.

మొట్టికాయలు పడితే కానీ మేల్కోలే!

- కోచింగ్ సెంటర్ల కట్టడిలో సర్కారు విఫలం
- జనవరిలో కేంద్రం మార్గదర్శకాలు
- మీనమేషాలు లెక్కించిన రాష్ట్రం
- కేంద్రం ప్రభుత్వం ఆగ్రహంతో అమలుకు నిర్ణయం
- ఇంటర్‌బోర్డుకు బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జేఈఈ, నీట్, ఎప్‌సెట్ వంటి పరీక్షలకు కోచింగ్ ఇస్తున్న శిక్షణ సంస్థలను కట్టడిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. చివరికి కేంద్ర ప్రభుత్వం మొట్టికాయ లేయడంతో ఇప్పుడు మేల్కొన్నది. ఇటీవలి కాలంలో కోచింగ్ సెంటర్లలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయి. దీనికితోడు వసతులు లేమి, సిబ్బంది కొరత వేధిస్తున్నది. అయినప్పటికీ ఫీజులు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో కోచింగ్ సెంటర్ల నియంత్రణకు కేంద్రం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్రాలన్నీ వాటిని అమలుచేయాలని సూచించింది. ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తొలిసారి ఉల్లంఘిస్తే రూ. 25 వేలు, రెండోసారి మళ్లీ అదే పనిచేస్తే రూ. లక్ష జరిమానా విధించాలని సూచించింది. పదేపదే అదే పనిచేస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించింది. వీటి అమలు విషయాన్ని రాష్ట్రం పెడచెవిన పెట్టింది. కేంద్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో తాజాగా క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించారు. కేంద్ర మార్గదర్శకాలను అమలు చేయాలని నిర్ణయించారు. ఈ బాధ్యతలను ఇంటర్‌బోర్డుకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

కేంద్ర మార్గదర్శకాల్లో ప్రధానమైనవి

- రోజులో ఐదు గంటలకు మించి క్లాసులు నిర్వహించకూడదు. తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో క్లాసులు నిర్వహించరాదు.
- శిక్షణ ఇచ్చే వ్యక్తి లేదా సంస్థ కోచింగ్ ప్రారంభించిన మూడు నెలల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తగు డాక్యుమెంట్లను సమర్పించాలి. దరఖాస్తు చేసిన మూడు నెలల్లోపు ఆయా దరఖాస్తును ఆమోదిస్తారు. లేదా తిరస్కరిస్తారు.
- ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో శిక్షణ ఇచ్చే సంస్థలు తప్పనిసరిగా ఆయా బ్రాంచ్‌లను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి.
- సెకండరీ విద్య (పాఠశాల విద్య) పూర్తిచేసిన వారిని మాత్రమే కోచింగ్ కోసం పేర్ల నమోదుకు అనుమతించాలి.
- శిక్షణ కేంద్రాల్లో అర్హులైన సిబ్బందిని నియమించుకోవాలి.
- విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ర్యాంకు గ్యారెంటీ హామీలు ఇవ్వరాదు. ఫలితాలపై మోసపూరిత ప్రకటనలివ్వరాదు.
- సిబ్బంది అర్హత, కోచింగ్ సెంటర్ వివరాలు, శిక్షణ అందించే కోర్సులు, వసతి సౌకర్యాలు, ఫీజు రీఫండ్‌కు సంబంధించిన సమాచారాన్ని బహిర్గత పరచాలి.

మాపై అరికో కేఫ్ ఆరోపణలు అవాస్తవం

- అక్కడ విస్కీతో ఐస్‌క్రీమ్ తయారీ
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అరికో కేఫ్ యాజమాన్యం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిపై చేసిన ఆరోపణలను ఆ శాఖ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఖండించారు. విస్కీతో ఐస్‌క్రీమ్‌ను తయారుచేసి కస్టమర్లకు, ముఖ్యంగా మైనర్లకు అమ్ముతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో ఇటీవల ఆ కేఫ్‌పై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి సిబ్బందిని పట్టుకున్నామని ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ కేఫ్‌లో మద్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఐస్‌క్రీమ్ తయారీకి 100 పైపర్ విస్కీని ఉపయోగించారని నిర్ధారించుకున్న తర్వాతే వారిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బందికి లంచాలు ఇవ్వకపోవడమే ఈ అరెస్టులకు, కేసుల నమోదుకు కారణమని, ఎక్సైజ్ సిబ్బందే ఐస్‌క్రీమ్‌లో విస్కీ కలిపారని అరికో కేఫ్ యాజమాన్యం చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని పేర్కొన్నారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచ శివారులో ఎండిపోయిన పత్తి మొక్కలు చూపిస్తున్న రైతు వెంకన్న

లీడర్లు చెప్పిన పొలాల్లోనే పంటల పరిశీలన?

- అసలు పంటలు నష్టపోయిన రైతులకు అన్యాయం?
- మా పొలాల్లోకి రావడం లేదని అన్నదాతల ఆవేదన
- లంచాలు ఇస్తేనే పరిహారం వస్తదంటున్న స్థానిక లీడర్లు
- నర్సింహులపేట మండలంలో అధికారుల తీరుపై ఫైర్

నర్సింహులపేట, సెప్టెంబర్ 15: పంట నష్టపరిహారం విషయంలో కొందరు నాయకులు చెప్పిన బాధితులకే న్యాయం జరుగుతున్నదని, పంటలు నష్టపోయిన మిగతా వారిని అధికారులు పట్టించుకోవడం లేదని వదిలి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల రైతులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే కోసం వచ్చిన అధికారులను తమకు నచ్చిన వారి పొలాల వద్దకే తీసుకెళ్తున్నారని, అధికారులు కూడా వారు చూపించిన పొలాల్లోనే నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నారని వాపోతున్నారు. దీనికి తోడు 'మేము చెప్తేనే పరిహారం వస్తుంది.. మాకు లంచాలు ఇవ్వాలి? లేకపోతే అంతేసంగతి. ఈ విషయం బయటకు చెప్పొద్దు.. ఒకవేళ చెప్తే పరిహారం రాదు' అని భయపెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేయాలని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఏవో, ఏఈవోలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనకు వచ్చిన అధికారులను కొంతమంది నాయకులు తమకు నచ్చిన పొలాలకు తీసుకువెళ్లి పంటల నష్టాన్ని చూపిస్తున్నారు. అసలు రైతులకు అన్యాయం చేస్తున్నారు. నష్టపరిహారం ఎక్కువగా ఇప్పించేందుకు డబ్బు సైతం వసూలు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలైన బాధిత రైతులకు అన్యాయం జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. పంటలను ఏవో, ఏఈవోలకు క్షేత్రస్థాయిలో చూపించాలని, ఇందులో ఎలాంటి పైరవీలకు తావులేదని ఏడీఏ విజయచందర్ స్పష్టంచేశారు.

భద్రాద్రి రామాలయం పేరుతో విరాళాల సేకరణ

- అమెరికాలోని ఆలయ నిర్వాహకుల దోపిడీ
- రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌కు ఫిర్యాదు: ఈవో

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 15: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం పేరుతో అమెరికాకు చెందిన ఓ ఆలయ నిర్వాహకులు విరాళాలు సేకరిస్తున్నట్టు గుర్తించామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి తెలిపారు. ఆలయంలోని చిత్రకూట మంటపంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరుతో విరాళాలు సేకరిస్తున్నారని, ఇప్పటికే కోట్ల రూపాయల విరాళాలు వసూలు చేసినట్టు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఖగోళ యాత్ర కోసం అమెరికా ఆలయ అర్చకులు భద్రాద్రి శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ పేరిట లెటర్‌ప్యాడ్‌ను రూపొందించి విరాళాలు సేకరిస్తున్నట్టు తెలియడంతో ఆ విషయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. భద్రాద్రి ఆలయం పేరుతో ఎవరైనా విరాళాలు సేకరించినా, భద్రాద్రి ఆలయ పేరును ఉపయోగించుకున్నా దేవాదాయశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని రమాదేవి హెచ్చరించారు. సమావేశంలో ఆలయ ఏఈవో భవానీ రామకృష్ణ, ఈఈ రవీందర్‌రాజు, సూపరింటెండెంట్ సాయిబాబా, అర్చకులు రామస్వరూప్, అమరవాది విజయరాఘవన్, గోపి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనం ఆర్సీ గడువు 15 ఏండ్లే

- ఆ తర్వాత ఐదేండ్లకోసారి రెన్యువల్ తప్పనిసరి
- లేకుంటే రవాణా శాఖకు జరిమానా చెల్లించాల్సిందే
- న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండాలంటే 60 రోజుల ముందే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం
- ఆర్సీరెన్యువల్‌కు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సాధారణంగా ప్రైవేటు వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) గడువు 15 సంవత్సరాలపాటు ఉంటుంది. ఇది ముగిసిన అనంతరం ప్రతి ఐదేండ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. లేకుంటే ఆర్టీవో అధికారుల తనిఖీల్లో పట్టుపడినప్పుడు భారీ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత ఆర్సీ రెన్యువల్ చేసుకోకుంటే సంవత్సరానికి వాహనం ఖరీదులో 10 శాతం వరకు అదనంగా ఫైన్ కట్టాల్సి ఉంటుంది. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండాలంటే గడువు ముగిసే తేదీకి ముందే రెన్యువల్ చేసుకోవడం ఉత్తమం. ఇందుకు ఆన్‌లైన్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్సీ రెన్యువల్‌కు ఫారం-25, దరఖాస్తు ఫారం, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్, ఆర్సీబుక్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, రోడ్‌టాక్స్ చెల్లించిన డాక్యుమెంట్లు, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, పాన్‌కార్డు, చాసిస్, ఇంజిన్ పెన్సిల్ పాయింట్ తదితరాలు అవసరమవుతాయి.

ఆన్‌లైన్‌లో రెన్యువల్ ఇలా..

- మొదట https://parivahan.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
- మెను నుంచి 'ఆన్‌లైన్ సేవలు' క్లిక్ చేసి.. 'వాహన సంబంధిత సేవలు'ను ఎంచుకోవాలి.
- మీ రాష్ట్రాన్ని, సమీప ఆర్టీవోను ఎంచుకుని 'ప్రొసీడ్'పై క్లిక్ చేయాలి.
- 'సేవలు' విభాగంలోకి వెళ్లి డ్రాప్-డౌన్ జాబితా నుంచి 'ఆర్సీ' సంబంధిత సేవలను ఎంచుకోవాలి.
- 'రిజిస్ట్రేషన్ రెన్యువల్'ని ఎంచుకుని, మీ వాహనం రిజిస్ట్రేషన్ నంబర్, చాసిస్ నంబర్‌ను ఎంటర్ చేయాలి
- దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయడానికి 'వివరాలను ధృవీకరించు'ను క్లిక్ చేయాలి.
- రెన్యువల్ చార్జీలతో పాటు ఇతర ఫీజులు కూడా ఉంటాయి.

ఆఫ్‌లైన్‌లో రెన్యువల్ ఇలా..

- ఆర్సీ రెన్యువల్ కోసం ఆర్టీవో కార్యాలయంలో యజమాని దరఖాస్తు చేయాలి. అందుకోసం ఫారం-25ను నింపాలి. వాహన గడువు ముగిసిన నాటినుంచి 60రోజుల్లోగా పూర్తిచేయాల్సి ఉంటుంది.
- ఆర్సీ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసిన తర్వాత, మీకు అపాయింట్‌మెంట్ ఇస్తారు.
- ఆ రోజు మీ వాహనాన్ని ఆర్టీవో కార్యాలయంలో సమర్పించాలి. ఆర్‌టీవో అధికారి మీ వాహనాన్ని తనిఖీ చేస్తారు.
- మీ వాహనంలో ఎలాంటి సమస్యలు లేనట్టయితే.. ఆర్టీవో ఇన్‌స్పెక్టర్ సంతకం చేసి రెన్యువల్‌కు ఆమోదముద్ర వేస్తారు.
- మీ వాహన ఆర్సీ రెన్యువల్ పూర్తయిన తర్వాత సంబంధిత చార్జీలు, పన్నులు చెల్లించాలి.
- రెన్యువల్ చార్జీలతోపాటు ఇతర ఫీజులు కూడా ఉంటాయి.

నేల విడిచిన హైడ్రా!

మొదటిపేజీ తరువాయి...

వైభవం సంతరించుకుంటుందా? ఈ కూల్చివేతలతో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు మూల్యం చెల్లించేదెవరు? అంటూ రేవంత్ ప్రభుత్వం బుల్డోజర్ పాలనపై సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చలు జరుగుతున్నాయి. హైడ్రాతో చెరువుల సంరక్షణ ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతుంటే.. అసలు కూల్చివేతలతో భయాభ్రాంతులకు గురిచేస్తున్న హైడ్రా తీరు సరైనదేనా? అనే ప్రశ్నలను నగరవాసులు లేవనెత్తుతున్నారు. విశ్వనగరంగా ఎదగాల్సిన మహానగరంలో చెరువుల పరిరక్షణ పేరిట కూల్చివేతలతో ప్రతిష్ఠ దిగజారిపోతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వివాదాస్పదంగా కూల్చివేతలు

400 ఏండ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్ లేక్ సిటీగా పేరు గాంచించింది. దేశంలో ఏ నగరంలో లేనన్ని గొలుసుకట్టు చెరువులు, కుంటలతో భాగ్యనగరం నిండిపోయింది. రాజుల కాలంలోనే ఇంటర్ లింకేజీ వాటర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్, చెరువుల వ్యవస్థను నిర్మించారు. పెరిగిన జనాభా, రాకెట్ వేగంతో విస్తరించిన హైదరాబాద్ నగర పరిధి, పట్టణీకరణతో వందల చెరువులు, కుంటలు నిర్వీర్యం అవుతున్నాయి. ఈ అంశాలేవీ పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలతోనే చెరువులకు పూర్వ వైభవం అన్నట్టుగా వ్యవహరిస్తున్న హైడ్రా తీరు వివాదాస్పదంగా మారింది.

చెరువుల నిర్వీర్యంలో అసలేం జరిగింది?

చెరువుల ఆక్రమణలు ఐదేండ్లో.. పదేండ్లకిందటో మొదలైనవి కావు. తరతరాలుగా నిర్వీర్యం అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాలన వైఫల్యమే ప్రధాన పాత్ర పోషించగా, అధికారుల నిర్లక్ష్యం, కబ్జాకోరుల ఆక్రమణలు, పేదల నిర్మాణాలు ఉన్నాయి. ఉదాహరణకు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉండే చెరువుకు కనీసం ఐదారు ఇన్‌ఫ్లో చానల్స్ ఉంటాయి. చెరువు నిం డిన తర్వాత బయటకెళ్లిపోయేందుకు అవుట్ లెట్స్ ఉంటాయి. ఇదీ చెరువు వాస్తవ రూపం. చెరువు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరగానే ఎఫ్‌టీఎల్ ఏర్పడుతుంది. కానీ ఎఫ్‌టీఎల్ భూము ల్లో ఇప్పుడు నిర్మాణాలు జరిగాయి. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణ కార్యకలాపాలతో చెరువులోకి వచ్చే ఇన్‌లెట్స్ దెబ్బతిన్నాయి.

హడావుడి చేసి.. వదిలేసి!

రాంనగర్ మణెమ్మ గల్లీలో హైడ్రా అధికారుల తీరిది

హైదరాబాద్ సిటీబ్యూరో/ముషీరాబాద్, సెప్టెంబర్ 15: హైదరాబాద్‌లో ఇప్పటి వరకు 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా తెలిపింది. ఆ కూల్చివేతలు చేపట్టిన చోట పరిరక్షణ చర్యలు మాత్రం చేపట్టలేదు. ఇటీవల రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలోని ఓ ఇంటికి సమీపంలో నాలా ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించి 20 రోజుల క్రితం భవనాన్ని హైడ్రా నేలమట్టం చేసింది. కానీ భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించలేదు. ఇదే అదనుగా పక్కనే ఉన్న భవన యజమాని.. కూల్చివేతలు జరిగిన స్థలంలో ఒకటి, రెండు ఫీట్లు జరిగి తాత్కాలిక రేకులు ఏర్పాటు చేశారు. మణెమ్మ గల్లీలో కూల్చివేతలు చేపట్టి 20 రోజులవుతున్నా వ్యర్థాలను తొలగించలేదు. ఓ భవనం గోడకు రంధ్రం చేసి వదిలేశారు. భవనం మొత్తాన్ని కూల్చేస్తామన్న టౌన్‌ప్లానింగ్, హైడ్రా పత్తాలేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టి తీసుకెళ్లినా స్పందించటం లేదని స్థానికురాలు లక్ష్మీబాయి వాపోయారు. డ్రైనేజీ పైపులైన్‌పైనే వ్యర్థాలను పోయడంతో మొత్తం బ్లాక్ అయ్యి సంపుల్లోకి మురుగునీరు వస్తున్నదని హైడ్రా తీరుపై మరో స్థానికురాలు శారద అసహనం వ్యక్తం చేశారు.

కూల్చివేతలతో సంరక్షణ సాధ్యమేనా?

మూసీ రివర్ ఫ్రంట్ నుంచి మొదలుకుంటే, దుర్గం చెరువు పరీవాహక ప్రాంతంలో అమర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వరకు విస్తరించిన అర్బనైజేషన్ కొత్తగా జరిగింది కాదు. హైడ్రా నివేదిక ప్రకారం నగరంలో ఉన్న 52 చెరువులు 60 శాతానికిపైగా నిర్మాణాలతో ఉన్నాయి. భవన నిర్మాణ అనుమతులు ఇచ్చినవే, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ధ్రువీకరించినవే. హైడ్రా ద్వారా కూల్చివేతలతోనే చెరువుల సంరక్షణ సాధ్యమా? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. చెరువుల ఇన్‌లెట్స్, అవుట్‌లెట్స్‌ను పునరుద్ధరించకుండా, పూడికను తీయకుండా కేవలం నిర్మాణాలను కూలిస్తే చెరువుల నీటినిల్వ పెరుగుతుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

పరీవాహక ప్రాంతాల్లో పేదలే ఎక్కువ

సబర్మతి తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును చేపడతామని ప్రభుత్వం చెప్తున్నది. కానీ సబర్మతి నది ఆధునీకరణలో ఎంతమంది నిరాశ్రయులయ్యారు? ఎంతమంది సొంత గూటిని కోల్పోయారనే విషయం కూడా చర్చించాలి. మూసీ వెంబడి నివాసం ఉండేవారిలో మెజార్టీ జనాలు నిరుపేద, మధ్యతరగతివారే. ఇటీవల సున్నం చెరువు ఆక్రమణలను కూల్చివేసిన సందర్భంలో ఓ నిరుపేద కుటుంబం నివసించే అవకాశమే కోల్పోయింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘనే. ఇలాంటి సమస్యలను పరిష్కరించకుండా నేరుగా హైడ్రా బుల్డోజర్లను పేదల ఇండ్లపై దింపితే చెరువులు, నదులు, కుంటలకు పూర్వ వైభవం ఎలా సాధ్యం అవుతుంది? ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో బస్తీ నిర్మూలన కార్యక్రమాలపై వందల కేసులు సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ అలాంటి పరిస్థితి రావొద్దంటే వారికి పునరావాసం కల్పించి బఫర్ జోన్‌లో ఉండే నిర్మాణాలను కూల్చితేనే మూసీకి పూర్వ వైభవం సాధ్యం.

అర్బన్ ఫ్లడింగ్ మాటేంటి?

భవిష్యత్తులో పొంచి ఉన్న అర్బన్ ఫ్లడింగ్‌ను పరిష్కరించే మార్గాల అన్వేషణ ఎందుకు జరగడం లేదు? అన్నది మరో కీలక ప్రశ్న. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ కూడా ప్రత్యేక సూచనలు, ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కానీ అవేవి పట్టనట్టు హైడ్రా కూల్చివేతలతో అర్బన్ ఫ్లడింగ్ నిరోధించగలుగుతారా? అంటే ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. అర్బన్ ఫ్లడింగ్ ప్రభావాన్ని నియంత్రించేలా ప్రత్యేక స్టామ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. అలా కాకుండా కూల్చివేతలతోనే పరిష్కారం ఎలా దొరుకుతుందని సోషల్ మీడియాలో విస్తృత స్థాయిలో ప్రశ్నలు, చర్చోపచర్చలు నడుస్తున్నాయి.

వైద్య సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : టీజీజీడీఏ కార్యవర్గం ఎన్నిక షెడ్యూల్‌ను ఆదివారం అసోసియేషన్ విడుదల చేసింది. హైకోర్టు అనుమతితో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపింది. హైకోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్లు జీఎం మొహియుద్దీన్, న్యాయపతి ప్రశాంత్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నట్టు పేర్కొంది. నేడు నోటిఫికేషన్ విడుదల చేసి 19 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 20న నామినేషన్ల పరిశీలన అనంతరం జాబితాను విడుదల చేయనున్నారు. 29న కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గెస్ట్‌హౌస్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనున్నది.

ఎన్‌పీఏ వార్షికోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్ అకాడమీలోని వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళి అర్పించారు. 1948 సెప్టెంబరు 15న రాజస్థాన్‌లోని మౌంట్‌అబూలో సెంట్రల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ స్థాపించారు. అయితే, ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు వచ్చే వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు దానిని 1975లో హైదరాబాద్‌కు మార్చారు. అప్పుడే వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీగా నామకరణం చేశారు.

జూరాలపై మరో పెనుభారం

హైదరాబాద్, సెప్టెంబర్15 (నమస్తే తెలంగాణ): మూలిగేనక్క మీద తాటికాయ పడ్డట్టుగా ఉన్నది రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు తీరు. ఇప్పటికే ఉన్న ఆయకట్టుకు అపసోపాలు పడుతున్న జూరాల ప్రాజెక్టుపై కొడంగల్ లిఫ్ట్ పేరిట మరో భారాన్ని మోపుతున్నది. భీమా పథకంలో ప్రతిపాదిత ఆయకట్టు మొత్తానికి ఇప్పటికీ పూర్తిస్థాయిలో నీరు ఇవ్వకున్నా కూడా పొదుపు పేరిట జలాల్లో కోత విధించడం కొసమెరుపు. మరోవైపు రాజీవ్‌భీమా ఆయకట్టు కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడింది. ట్రిబ్యునల్ ఎదుట కొట్లాడి నికర జలాలను సాధించాల్సింది పోయి, సొంత నియోజకవర్గం కోసం వేరొక ప్రాజెక్టులోని నికరజలాల్లోనే కోత విధించే దుర్మార్గానికి సర్కారు తెగబడింది.

జూరాలపై మరో పెనుభారం

జూరాల ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ 17.84 టీఎంసీలను కేటాయించింది. ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వచ్చే సమయానికే దాని గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుత లైవ్ కెపాసిటీ 6.8 టీఎంసీలు మాత్రమే. వాస్తవాలు తెలిసినా.. తక్కువగా నీటినిల్వ ఉన్న చోటు నుంచి ఆయకట్టుకు నీరిచ్చే పరిస్థితి ఉండబోదని నెత్తినోరు బాదుకుంటున్నా ఉమ్మడి రాష్ట్ర ఏలికలు కుట్రపూరితంగా, కృష్ణాజలాలు తెలంగాణకు దక్కకుండా చేసేందుకు జూరాల ప్రాజెక్టును ఆధారంగా చేసుకునే అనేక ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించారు. రాజీవ్‌భీమా స్టేజ్ 1, స్టేజ్ 2, కోయిల్‌సాగర్, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలను జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచే చేపట్టారు. మొత్తంగా ఒక్క జూరాల ప్రాజెక్టుపై ఆధారపడి ఇప్పటికే 5.48లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ ఆయకట్టుకే యాసంగిలో నీరందించలేని దుస్థితి. కేవలం ఒకే పంటకే నీరందిస్తున్నారు.

10వేల నుంచి 15వేల ఎకరాలకు పెంపు..

కృష్ణా డెల్టాకు ట్రిబ్యునల్ -1 దాదాపు 183 టీఎంసీలను చారిత్రక రక్షణల కింద కేటాయించింది. డెల్టా కాల్వల ఆధునీకీకరణ వల్ల 29 టీఎంసీల మేరకు మిగులు ఏర్పడుతున్నదని చెప్పి అందులో 9 టీఎంసీలను పులిచింతల ప్రాజెక్టుకు కేటాయించింది. ప్రాజెక్టు కింద ఒక టీఎంసీకి 10వేల ఎకరాలకు నీరందించేలా మొత్తంగా 2.03 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని నిర్ణయించారు. జలయజ్ఞంలో భాగంగా రాజీవ్ భీమా ప్రాజెక్టును ప్రారంభించినా రాష్ట్ర ఏర్పాటు నాటికి పనులేమీ పూర్తికాలేదు. కేసీఆర్ హయాంలో పూర్తయ్యాయి. భీమా ఆయకట్టు రైతులకు చెందాల్సిన 7.33 టీఎంసీల జలాల్లో 7.11 టీఎంసీలను నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కేటాయించడం గమనార్హం.

భీమా ఆయకట్టు ప్రశ్నార్థకమే?

రాజీవ్‌భీమా ఎత్తిపోతల పథకాన్ని రెండు స్టేజ్‌లుగా చేపట్టారు. జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌పై రామన్‌పాడు వద్ద పంచదేవపాడు గ్రామం వద్ద ఒకటి, ఊకచెట్టి వాగు ప్రాజెక్టుపై 2వ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా దీర్ఘకాలికంగా కరువు పీడిత మక్తల్, మాగనూరు, ఆత్మకూర్, నర్వ, చింతకుంట, దేవరకద్ర, కొత్తకోట, పెద్దమందడి, మహబూబ్‌నగర్ జిల్లాలోని పెబ్బేర్, పాన్‌గల్, వీపనగండ్ల, కోడేరు, కొల్లాపూర్ మండలాల్లోని తదితర మెట్ట ప్రాంతాల్లోని మొత్తం 2లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉంది. ప్రస్తుతం 1.58లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. ఇంకా 40వేల ఎకరాలకుపైగా నీరందించాల్సి ఉంది. ఇదిలా ఉంటే భీమా ప్రాజెక్టు మొత్తంలో నీటినిల్వకు భూత్పూర్, సంగంబండ, రంగసముద్రం, శంకరసముద్రం రిజర్వాయర్లు ఉండగా, వాటి మొత్తం నిల్వసామర్థ్యం 8.3టీఎంసీలే. భీమా స్కీమ్‌లో ప్రధానమైన, మొదటిదయిన భూత్పూర్ రిజర్వాయర్ (1.3టీఎంసీలు) నుంచే ప్రస్తుతం నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టారు. ఈ రిజర్వాయర్ నుంచే 7టీఎంసీల జలాలను తరలించాలే ప్రణాళికలను రూపొందించారు.

ప్రాజెక్టు	నీటికేటాయింపులు	ప్రాజెక్టుకింద నీటినిల్వసామర్థ్యం	ప్రతిపాదిత ఆయకట్టు	ప్రస్తుతం సాగునీరు అందుతున్నది
జూరాల	17.33టీఎంసీలు	9.66 టీఎంసీలు	100000	100000
రాజీవ్‌భీమా	20	8.32	1,98,600	1,58,000
నెట్టెంపాడు	22 (వరద జలాలు)	5.19టీఎంసీలు	200000	1,42,000
కోయిల్‌సాగర్	3.5	1.50	50,000	30,000
మొత్తం	62.83	24.67	5,48,000	3,40,000
నారాయణపేట కొడంగల్	7.23	3	100000	000

(నోట్: సాగునీరు కాకుండా ఆయా ప్రాజెక్టుల కింద మిషన్‌భగీరథ నీటి కేటాయింపులు కూడా ఉన్నాయి)

ఇదీ కేసీఆర్ దార్శనికత..

ఉమ్మడి పాలకుల వివక్ష మూలాన కోల్పోయిన నీళ్లను ఒడిసిపట్టేందుకు స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రాజెక్టుల రీఇంజినీరింగు చేపట్టారు. కృష్ణాబేసిన్‌లో చాలా వరకూ అన్ని లిఫ్టు స్కీంలు కావడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎక్కువగా ఉంచుకోవాల్సిన అవసరం మరింతగా ఉందని చెప్పడమే కాదు.. ఆ దిశగా చర్యలు చేపట్టారు. రిజర్వాయర్లలో సాధ్యమైనంత నీటి నిలువ సామర్థ్యాన్ని పెంచుతూ రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టారు. జూరాలపై ఉన్న భారాన్ని గుర్తించి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇంటేక్ పాయింట్‌ను ఏడాది పొడవునా నీటినిల్వలు ఉండే శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌కు మార్చారు. ఇక పీఆర్ఎల్ఐఎస్ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యాన్ని 67.97టీఎంసీలు పెట్టారు. ప్రస్తుత రేవంత్ సర్కారుకు ఆ సోయి లేకుండా జూరాలపైనే మరో ప్రాజెక్టును చేపట్టడం గమనార్హం. దీనిపై సాగునీటిరంగ నిపుణులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతలపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.